క్లుప్తంగా

శివాలయ నిర్మాణానికి రూ. 3 లక్షల విరాళం



కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సతీమణి శ్రీదేవి

దత్తిరాజేరు: మండలంలోని టి. భూర్జవలసలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి పీఏసీ సభ్యుడు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ దంపతులు మూడు లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు కమిటీ సభ్యులకు సోమవారం నగదు అందజేశారు. స్వగ్రామంలో శివాలయం నిర్మించడం ఎంతో ఆనందంగా ఉందని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ సతీమణి బెల్లాన శ్రీదేవి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దోమకాటుతో మలేరియా



మలేరియాపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ తిరుపతి

గంట్యాడ: దోమ కాటు వలన మలేరియా వ్యాధి వ్యాపిస్తుందని పెదమజ్జిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ తిరుపతి అన్నారు. మండలంలోని డీకేపర్తి గ్రామంలో మలేరియా వ్యాధిపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమలు కుట్టడం వల్ల డెంగీ, ఫైలేరియా వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల దోమలను నియంత్రించ వచ్చని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. అలాగే దోమతెరలను తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్‌ఎం దేవి పాల్గొన్నారు.

కొలతల మేరకు పని..

- ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ



కృష్ణారాయుడుపేటలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: జాతీయ ఉపాధి హామీ పథకం వేతనదారులకు సమయ పాలన పాటిస్తూ కొలతల ప్రకారం పనులు చేస్తే గరిష్ట వేతనం పొందవచ్చని ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కృష్ణారాయుడుపేటలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ.. ఇచ్చిన కొలతల మేరకు పని చేయాలన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకుడు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తం

- తహసీల్దార్ అజూరఫీజాన్



మాట్లాడుతున్న తహసీల్దార్ అజూరఫీజాన్

మెరకముడిదాం: అకాల వర్షాల పట్ల వీఆర్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అజూరఫీజాన్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి చెందిన వీఆర్‌ఓలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎవరికి కేటాయించిన గ్రామాల్లో వీఆర్‌ఓలు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే రైతులకు చెందిన భూముల సమస్యలను ఎప్పటికప్పుడు కార్యాలయానికి తెలియజేసి వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. రేషన్ లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భాస్కరరావు, పలువురు వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వైభవంగా పేరంటాల విగ్రహాల ప్రతిష్ఠ



విగ్రహాల ప్రతిష్ఠలో పాల్గొన్న దంపతులు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో గుండాలమ్మ, పైడమ్మ పేరంటాల విగ్రహాలు.. మరో ఆలయంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ సోమవారం ప్రతిష్ఠించారు. కేఎస్ సురేష్‌శర్మ ఆధ్వర్యంలో జలాధివాసం, ధాన్యాధివాసం, కలశాల ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్లు, మహిళా కోలాటం, తదితర కార్యక్రమాలు అలరించాయి. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పూడిక తీత పనులకు..
నడుం బిగించిన రైతన్నలు..

- 13 వంతుల కాలువలో పూడికతీత పనులు
- అభివృద్ధి పనులకు పైసా విదల్చని ప్రభుత్వం
- రైతులే చందాలు వేసుకుని పనులు చేసుకుంటున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



గజపతినగరం వద్ద పిచ్చిమొక్కలతో ఉన్న కాలువ



రైతులు బాగుచేసుకున్న కాలువ

గజపతినగరం: ఆరుగాలం కష్టపడి వ్యవసాయం చేస్తున్న అన్నదాతలకు ఆదిలోనే కష్టాలు మొదలయ్యాయి. మండల పరిధిలో ప్రవహించే చంపావతి నది నుంచి 13 వంతుల కాలువ ఐదు గ్రామాలకు నీరు అందించే జీవనాడిగా పేరుగాంచింది. అయితే ఈ కాలువ నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఎక్కడికక్కడే పూడికలు పేరుకుపోవడంతో పాటు పిచ్చిమొక్కలు మొలిచాయి. అలాగే ఈ కాలువ నుంచి నీటిని మళ్లించేందుకు బ్రిటీష్ హయాంలో ఏర్పాటు చేసిన గేట్లు ప్రస్తుతం తుప్పుపట్టిపోయాయి. గేట్లు పాడైపోవడంతో సాగునీరు వృథాగా పోతోందని.. వీటి స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేసి, చంపావతి నది మొదటి భాగంలో 100 మీటర్ల వరకు రక్షణ గోడ నిర్మించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. 13వ వంతుల కాలువ గజపతినగరం మండలం పిడిశీల, కాలంరాజుపేట, సీతారామపురం.. బొండపల్లి మండలంలో బొండపల్లి, ముద్దూరు గ్రామాల పరిధిలోని ఆయకట్టుకు ప్రతి ఏడాదీ సాగునీరు అందిస్తోంది. ప్రతి ఏటా కాలువలోని నీటిని ఐదు గ్రామాల ప్రజలు 13 వాటాలుగా వేసుకుని మళ్లించుకుని పంటలు సాగు చేస్తుంటారు. కాలంరాజుపేట 3 వంతులు, పిడిశీల 4 వంతులు, బొండపల్లి 2 వంతులు, ముద్దూరు 2 వంతులు, సీతారామపురం రైతులు 2 వంతుల చొప్పున నీటిని వినియోగించుకుంటారు. అయితే కాలువలో ఎటువంటి పనులు చేపట్టకపోవడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు అందకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చందాలు పోగు చేసుకుని కాలువ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. జేసీబీలు వినియోగించి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు, పిచ్చిమొక్కలను తొలగిస్తున్నారు. సుమారు 1300 ఎకరాల ఆయకట్టుకు నీరందించే 13వ వంతుల కాలువను ప్రభుత్వం అభివృద్ధి చేసి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



జేసీబీతో పనులు చేయిస్తున్న రైతులు

నిధులు మంజూరు కాలేదు..

13 వంతుల చానల్ కాలువ మైనర్ ఇరిగేషన్ కింద వస్తుంది. మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి ఎటువంటి నిధులు మంజూరు కాలేదు. 13 వంతుల కాలువలో జంగిల్ క్లియరెన్స్‌కు, షట్టర్ల మరమ్మతులు, ఇతర పనులకు రూ. 36 లక్షలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరుకాగానే పనులు చేపడతాం. – రామునాయుడు, ఇరిగేషన్ డీఈ

13 వందల ఎకరాలకు సాగునీరు..

13వంతుల కాలువ నీరే రైతులకు ఆధారం. ఐదు గ్రామాల పరిధిలో సుమారు 13 వందల ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. ప్రభుత్వం కాలువ అభివృద్ధికి ముందుకు రాకపోవడంతో రైతులమే చందాలు వేసుకుని స్వచ్ఛంధంగా పనులు చేపడుతున్నాం.

–లింక నాగేశ్వరరావు, రైతు, కాలంరాజుపేట

ధ్వజస్తంభం ప్రతిష్ఠ..



దత్తిరాజేరు మండలం టి. భూర్జవలసలో దుర్గాదేవి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కొండపల్లి అప్పలనాయుడు, తదితరులు పూజలు నిర్వహించారు. – దత్తిరాజేరు

చెరువు కాదు రోడ్డే..



పై చిత్రంలో కనిపిస్తున్నది చెరువు కాదు..రోడ్డే. అది కూడా ఏదో మారుమూల గ్రామీణ ప్రాంతంలో అనుకుంటే పొరపాటే. చీపురుపల్లి పట్టణంలోని పోలీస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలు. చిన్నపాటి వర్షానికి కూడా గోతుల్లో నీరు చేరడంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కూటమి నాయకులు, అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. – చీపురుపల్లి

సూపర్ సిక్స్ అంతా మోసం..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి అనంతం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి అనంతం

చీపురుపల్లి: కూటమి నాయకులు ప్రకటించిన సూపర్ సిక్స్ అంతా మోసమేనని, అధికారం చేపట్టి ఏడాదైనా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రేగిడి లక్ష్మణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..

ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్న తరుణంలో ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన నేపథ్యంలో ఈ నెల నాలుగో తేదీన వెన్నుపోటు దినం పేరిట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. అన్నదాత సుఖీభవ పేరిట రైతులను ఆడబిడ్డ నిధి పేరిట యువతులను మోసం చేశారన్నారు. అలాగే తల్లికి వందనం, ఉచిత బస్సు హామీలు కూడా గాలిలో కలిసిపోయాయని చెప్పారు. డిగ్రీ చదువుకునే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాల కల్పన ఏమయ్యాయని ప్రశ్నించారు. వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లోగిశ కనకరాజు, రేగిడి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క హామీ నెరవేర్చలేదు..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు చలం నాయుడు, చిన్నంనాయుడు

బొండపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఎంపీపీ చల్లాం చలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు అన్నారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ నియోజకవర్గ కేంద్రంలో నాలుగో తేదీన వెన్నుపోటు దినం పేరిట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిరసనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లి రఘు, మహంతి రమణ, మీసాల తులసీరాం, బొండపల్లి ఈశ్వరరావు, తాడ్డి చందు, ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం'ను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గజపతినగరం రూరల్: ఈ నెల 4వ తేదీన నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న వెన్నుపోటు దినంను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై, కార్యక్రమాన్ని విజవయంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బెల్లాన త్రినాథ, కె.పైడపునాయుడు, కరణం ఆదినారాయణ, కర్రి రామునాయుడు, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో పురిటిపెంట విద్యార్థిని హవా



గజపతినగరం రూరల్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో పురిటిపెంట గ్రామం న్యూకాలనీకి చెందిన విద్యార్థిని సంగిరెడ్ల హిమబిందు ఆల్ ఇండియా స్థాయిలో 1390వ ర్యాంకు సాధించింది. దీంతో ఆమెను తల్లిదండ్రులు సంగిరెడ్ల మంగమ్మ, పురుషోత్తం నాయుడులు అభినందించారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ.. కంప్యూటర్ ఇంజినీర్ కావడమే తన లక్ష్యమన్నారు.

పశువుల లారీ సీజ్



లారీలో ఉన్న పశువులు

బొండపల్లి: మండల కేంద్రం మీదుగా జాతీయ రహదారి 26పై పశువులను తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు ఎస్సై యు. మహేష్ తెలిపారు. సోమవారం సాయంత్రం తనిఖీలు చేపడుతుండగా.. సాలూరు వైపు నుంచి విజయనగరం వస్తున్న లారీ పట్టుబడిందన్నారు. 32 పశువులను విడిపించి, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పశువులను గోశాలకు తరలించినట్లు చెప్పారు.

నేడు వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం

శృంగవరపుకోట: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మంటపంలో సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడుబండి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల పార్టీ అధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ విభాగాల కార్యవర్గ సభ్యులు హాజరు కావాలని కోరారు.

గురుదేవా చోరీ మిస్టరీ వీడేనా..!

- దర్యాప్తులో కానరాని పురోగతి

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం తోట బంగళా చోరీ మిస్టరీగా మిగిలిపోనుందా.. అంటే అవుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చోరీ జరిగి వారం పూర్తయినా ఎటువంటి పురోగతి కనిపించలేదు. గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు (తోటలో బంగళా)ఇంట్లో గత మంగళవారం రాత్రి చోరీ జరిగిన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు తొలుత ట్రస్టులో ఉన్న ఐదుగురు వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేసి వారిని స్టేషన్ తరలించి విచారించారు. దీంతో వారు మేమే దొంగతనం చేశామని ఒప్పుకొని చోరీ చేసిన సొత్తు అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలోని దాచిపెట్టాం అంటూ పోలీస్‌లకు తెలిపారు. అయితే చోరీ సొత్తును స్వాధీనం చేసుకునేందుకు పోలీస్‌లు వెళ్లగా అనుమానితులు ఇక్కడ పెట్టాం.. అక్కడ పెట్టాం అంటూ పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో పోలీసులు వారిని గట్టిగా ప్రశ్నించడంతో మీరిచ్చే ట్రీట్‌మెంట్‌కు బయపడి నేరం అంగీకరించమని చెప్పడంతో పోలీస్‌లు అవాక్కయ్యారు.

పార్థా ముఠా పనేనా..?

ఒక అనుమానితుడి వేలిముద్రలు మహారాష్ట్రలోని పార్థా ముఠా సభ్యుడి వేలిముద్రలతో సరిపోయాయి. దీంతో చోరీకి పాల్పడిందీ పార్థా ముఠాయేనన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఈ క్రమంలో కొత్తవలస సీఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో పోలీసులు మహారాష్ట్రకు పయనమైనట్లు తెలిసింది.

చోరీ సొత్తుపై ఆరా..

ఫిర్యాదులో పేర్కొన్న బంగారం కన్నా పది రెట్లు ఎక్కువ బంగారం, నగదు పోయినట్లు బాధితుడు జగదీష్‌బాబు తెలిపారు. కాగా పోలీస్‌లు మాత్రం 90 తులాల బంగారం, రూ. 5 లక్షల నగదు పోయినట్లు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే కొత్తవలస పీఎస్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు సోమవారం మరోసారి ట్రస్ట్ వద్దకు వెళ్లి చోరీ సొత్తుపై ఆరా తీశారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పేదలు

- సీపీఐ నాయకుడు డేగల అప్పలరాజు

కొత్తవలస: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని సీపీఐ నియోజకవర్గ అధ్యక్షుడు డేగల అప్పలరాజు అన్నారు. ఈమేరకు పట్టణ పేదలతో కలిసి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు.అలాగే ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ బి.నీలకంఠరావుకు వినతిపత్రం అందజేశారు.

ఆరోగ్యాంధ్ర సాధనే 'యోగాంధ్ర' లక్ష్యం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



యోగాసనం వేస్తున్న మంత్రి శ్రీనివాస్



యోగాసనాలు వేస్తున్న అభ్యాసకులు

గంట్యాడ: ఆరోగ్యాంధ్ర సాధనే యోగాంధ్ర ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని చెప్పారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణ మూర్తి, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ శిబిరం

వేపాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు 'యోగాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఐదు రోజులుగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ పి.వెంకటరావు మాట్లాడుతూ.. ప్రతిరోజూ 30 నిమిషాలు ఆసనాలు వేయడం వల్ల మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రవికుమార్‌తో పాటు పలువురు సచివాలయ సిబ్బంది రేషన్‌డిపో డీలర్లు, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పుణ్యగిరిలో ఆధ్యాత్మిక సందడి

- పుణ్య తిరుమల గిరి పేరుతో వేంకటేశ్వరస్వామి ఆలయం
- నేడు శోభాయాత్ర...
- 6న విగ్రహాల ప్రతిష్ఠ



కార్యక్రమాలను వెల్లడిస్తున్న కమిటీ సభ్యులు

శృంగవరపుకోట: ఉత్తరాంధ్రలో వాసికెక్కిన పుణ్యగిరి క్షేత్రం మరింత ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. పుణ్యగిరి క్షేత్రంలో పుణ్య తిరుమలగిరి పేరుతో పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం రూపుదిద్దుకుంది. కొన్నేళ్లుగా ఊరిస్తున్న ఈ ప్రాజెక్ట్ ఎట్టకేలకు రూపుదాల్చింది. త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జియర్‌స్వామి వారి పర్యవేక్షణలో మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి.

శోభాయాత్ర

పుణ్య తిరుమలగిరిలో ఆలయ ప్రారంభోత్సవం నేపథ్యంలో ఆలయ నిర్మాణ, నిర్వహణ కమిటీ సభ్యులు సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు మాట్లాడుతూ.. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని షిర్డీ సాయిబాబా గుడి నుంచి మేళతాళాలు, భాజాభజంత్రీలు, గరిడీ విన్యాసాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తబృందాల కోలాటాలు, భజనల నడుమ పెరుమాళ్లు, అమ్మవార్లు, సుదర్శనం, పూర్ణ కలశాలను గాంధీబొమ్మ, దారగంగమ్మ ఆలయాల మీదుగా ఊరేగిస్తూ శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు.

మూడు రోజులూ ప్రత్యేక కార్యక్రమాలు

4వ తేదీన అరణి మథనం, అగ్ని ప్రతిష్ఠ, మూర్తికుంభ స్థాపన, మూలమంత్ర, మూర్తిమంత్ర హవనాలు, పూర్ణాహుతి, పంచగవ్యాధివాసం, ధాన్యాధివాసం నిర్వహిస్తారు. 5న శాంతిపాఠం, వాస్తు హోమం, పూర్ణాహుతి, పర్యగ్నీకరణం.. 6వ తేదీ ఉదయం 9.30గంటలకు పద్మావతీ, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి, ఆంజనేయ, విష్వక్సేన విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శాంతి కల్యాం, తదితర కార్యక్రమాలు చేపడతారు. మంగళగిరి యాదగిరి స్వామి పర్యవేక్షణలో కార్యక్రమాలు సాగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు. నిర్వహిస్తున్నట్టు చెప్పారు. భక్తులు వేలాధిగా హాజరై కార్యక్రమాలను దిగ్విజయం చేయాలని కోరారు.